సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం : 8 : జూలై : 2025



‘మహిళా కోష్’తో వణుకు!

మహిళా సమాఖ్యల రుణాల రికవరీపై ఢిల్లీకి చెందిన ఎన్‌జీఓ రాష్ట్రీయ మహిళాకోష్ మళ్లీ నోటీసులు జారీ చేసింది. 8లో



పర్ణశాలలో అభివృద్ధి పనులు

పర్ణశాల రామాలయానికి ప్రసాద్ పథకంతో మహర్దశ పట్టనుంది. చేపట్టిన పనులు పూర్తయితే ఆలయ రూపురేఖలు మారనున్నాయి. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం 33° / 24°

జిల్లాలో మంగళవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం తర్వాత కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి మూలమూర్తులు సోమవారం ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చి కనువిందు చేశారు. తెల్లవారుజామున గర్భగుడిలో సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని మేళతాళాల నడుమ బేడా మండపంలో కొలువుదీర్చారు. విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పులికాదు.. తోడేలు !

పాదముద్రలు సేకరించిన అటవీ అధికారులు



పాండురంగాపురంలో పాద ముద్రలు సేకరిస్తున్న అధికారులు

పాల్వంచరూరల్ : పాండురంగాపురం – నర్సంపేట పరిసరాల్లో పెద్దపులి సంచారం ఉదంతం వైరల్ కావడంతో పాల్వంచ అటవీ శాఖ రేంజర్ సురేష్, డీఆర్‌ఓ సిబ్బందితో కలిసి సోమవారం పాండురంగాపురం నుంచి ఉప్పుసాక మార్గంలో పరిశీలించారు. అక్కడ లభించిన పాదముద్రలు నక్క లేదా తోడేలుకు సంబంధించినవని గుర్తించారు. పులి పాదముద్ర అయితే 10 సెం.మీ.వెడల్పు, 14 సెం.మీ. పొడవు ఉంటుందని, ఇక్కడున్న పాదముద్రలు 6 సెం.మీ. వెడల్పు, 7 సెం.మీ.పొడవు మాత్రమే ఉన్నాయని వివరించారు. పరిసర ప్రాంత రైతులు, ప్రజలు కూడా పులి ఆనవాళ్లు కనిపించలేదని చెప్పారని, పులి సంచారం ప్రచారాన్ని ఎవరూ నమ్మొద్దని రేంజర్ సూచించారు.

మహిళలంతా ఎస్‌హెచ్‌జీలో సభ్యులుగా ఉండాలి

డీఆర్డీఓ విద్యాచందన



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

చుంచుపల్లి: జిల్లాలోని ప్రతీ మహిళ స్వయం సహాయక సంఘాల్లో సభ్యురాలిగా ఉండాలని, అవసరమైతే కొత్త సంఘాలు ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఓ ఎం.విద్యాచందన సెర్ప్ సిబ్బందికి సూచించారు. సోమవారం కొత్తగూడెంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కొత్త సంఘాల్లో బాలికలు, వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం కల్పించాలన్నారు. మహిళా సంఘాల ద్వారా 2024 – 25 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతి, 2025 – 26 భవిష్యత్ ప్రణాళికను వివరించారు. బ్యాంకు లింకేజీ ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో 101 శాతం ప్రగతి సాధించామని, ఈ ఏడాదిలో 100 శాతం ప్రగతి సాధించాలని అన్నారు. ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకాలను ప్రతీ మహిళ వినియోగించుకోవాలని సూచించారు. మహిళా సంఘాల సభ్యులకు స్కూల్ యూనిఫామ్ తయారీ చార్జీలు మొత్తం రూ. 97,98,058 మంజూరయ్యాయని చెప్పారు. మహిళా సంఘాల సభ్యులకు జిల్లాలో 9 బస్సులు కేటాయించామని, ఒక్కో బస్సును రూ.36 లక్షల చొప్పున మండల సమాఖ్య ద్వారా కొనుగోలు చేసి అద్దెకు ఇచ్చామని తెలిపారు. సమావేశంలో అదనపు డీఆర్‌డీఓ (సెర్ప్) నీలేష్ పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న ఎప్‌సెట్ కౌన్సెలింగ్

ఖమ్మం సహకారనగర్: ఎప్‌సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు ఇంజినీరింగ్ కాలేజీల్లో ప్రవేశాలు కల్పించేందుకు చేపట్టిన కౌన్సెలింగ్ మంగళవారం ముగియనుంది. ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో గత వారం రోజులుగా సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతోంది. ఈ కౌన్సెలింగ్ మంగళవారం ముగియనుందని ప్రిన్సిపాల్ డాక్టర్ మొహ్మద్ జాకిరుల్లా, కౌన్సెలింగ్ కోఆర్డినేటర్ చందా సుధాకర్ తెలిపారు. కాగా, సోమవారం 800 మంది విద్యార్థులు స్లాట్ బుక్ చేసుకోగా 760మంది హాజరయ్యారని వెల్లడించారు.

పరిశ్రమల ఊసేది?



జాడలేని చిన్న, మధ్య తరహా ఫ్యాక్టరీలు

- మైదాన ప్రాంతాల్లో ఏర్పాటుకు స్థలాలు కరువు
- ఏజెన్సీ ఏరియాలో అందని బ్యాంకు రుణాలు
- జిల్లాలో మందకొడిగా పారిశ్రామిక పురోగతి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ మందికి జీవనోపాధి కల్పించే చిన్న, మధ్య తరహా పరిశ్రమల జాడ జిల్లాలో అంతంతగానే ఉంది. తెలంగాణ వచ్చిన తర్వాత ఎంతో గర్వంగా చెప్పుకున్న నూతన పారిశ్రామిక విధానం – టీఎస్ ఐ పాస్ ద్వారా లేదంటే ప్రస్తుత ‘ప్రజాపాలన’లో కానీ జిల్లాకు చెప్పుకోదగ్గ చిన్న, మధ్య తరహా పరిశ్రమలు రాలేదు.

అప్పట్లో హడావిడి..

ప్రతీ నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు స్థాపించాలని గత ప్రభుత్వ హయాంలో లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే భద్రాచలం, కొత్తగూడెం నియోజకవర్గాల పరిధిలో అవసరమైన ప్రభుత్వ స్థలాలు లేవని తేల్చేశారు. మిగిలిన మూడు నియోజకవర్గాలకు సంబంధించి ఇల్లెందు మండలం లచ్చగూడెం, అశ్వాపురం మండలం గొందిగూడెం, అశ్వారావుపేట మండలం తిరుమలకుంట పరిధిలో ప్రభుత్వ స్థలాలను గుర్తించారు. కానీ ఆ తర్వాత ఈ అంశంలో అడుగు ముందుకు పడలేదు. దీనిపై రాజకీయ నాయకుల నుంచి చొరవ లేకపోవడం, జిల్లా అధికారుల వైపున క్రియాశీలత లోపించడంతో కొత్త పరిశ్రమల స్థాపన ‘ఎక్కడ వేసిన గొంగళి అక్కడే’ అన్నట్టుగా మారింది. ఈ అంశం తెరపైకి వచ్చినప్పుడల్లా అనువైన స్థలాలు, బ్యాంకు రుణాలు లేవంటూ కాలం గడుపుతున్నారు.

రుణాలు వచ్చేది ఎలా?

సారపాక ఐటీసీ, పేపర్ పరిశ్రమ నుంచి వెలువడే కలప గుజ్జు ఆధారంగా బూర్గంపాడు మండలం లక్ష్మీపురం గ్రామ పంచాయతీ(1/70 పరిధిలో లేదు)లో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు అనేకం వెలిశాయి. ఇదే తరహాలో సింగరేణి, థర్మల్ పవర్ ప్లాంట్ వంటి భారీ పరిశ్రమలకు అనుబంధంగా మధ్య, చిన్న, కుటీర తరహా పరిశ్రమలు ఇక్కడ నెలకొల్పే అవకాశముంది. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, ప్రాసెసింగ్ పరిశ్రమలు స్థాపించే వీలుంది. అయితే జిల్లాలో అత్యధిక ప్రాంతం 1/70 చట్టం పరిధిలో ఉండడంతో పరిశ్రమల స్థాపన అవసరమయ్యే మూలధనం సమకూర్చుకునే విషయంలో ఇబ్బందులు ఉన్నాయి. ఈ చట్టం పరిధిలోకి వచ్చే ప్రాంతాల్లో రుణాల మంజూరుకు బ్యాంకులు ససేమిరా అంటున్నాయి. ఈ సమస్యకు పరిష్కారం చూపే దిశగా ఎలాంటి ప్రయత్నాలు జరగడం లేదు.

గిరిజన ప్రణాళిక కావాలి..

ఏజెన్సీ జిల్లాలో పరిస్థితులు, వెనుకబాటుతనంతో పాటు ఇక్కడ అమల్లో ఉండే చట్టాలను అనుసరించి పారిశ్రామిక అభివృద్ధికి సరికొత్త ప్రణాళికలు అమలు చేయాల్సిన అవసరముంది. జిల్లాలో ఉన్న సహజ వనరులు, ఇప్పటికే విజయవంతంగా నడుస్తున్న పరిశ్రమలు, ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్ట్యా ఇక్కడ ఏ పరిశ్రమలు స్థాపించవచ్చనే అంశంపై రోడ్‌మ్యాప్ సిద్ధం చేయాలి. అలాగే నెలకొల్పబోయే పరిశ్రమలకు అవసరమైన మూలధనం సమకూర్చేందుకు ఐటీడీఏతో పాటు గిరిజన సంక్షేమ శాఖలు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. ఇవేమీ లేకుండా మైదాన ప్రాంతాలకు అన్వయించే విధానాలనే వెనుకబాటు తనం, ప్రత్యేక సంస్కృతి, జీవన విధానం ఉండే ఏజెన్సీ ప్రాంతంలో కూడా అమలు చేయడం సబబు కాదనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇన్నాళ్లూ ఇలా చేయడం వల్లే జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కనీస స్థాయిలో కూడా లేకుండా పోయాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

నిరుపయోగంగా స్థలాలు..

కొత్తగూడెం నగర నడిబొడ్డున వందల ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కును దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. ఈ స్థలంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తామంటూ గతంలో అనేక మంది లీజుకు తీసుకున్నారు. కొందరు తూతూ మంత్రంగా యూనిట్లు స్థాపించి ఆ తర్వాత మూలన పడేశారు. ఇక జిల్లా కేంద్రం పరిధిలోని రామవరంలో బేరియం ఫ్యాక్టరీ స్థలం నిరుపయోగంగా మారి దట్టమైన అడవిని తలపిస్తోంది. పరిశ్రమల కోసం పక్కన పెట్టి, ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న భూముల లెక్క తీస్తే జిల్లా కేంద్రంలోనే కొత్త పరిశ్రమలకు అవసరమైనంత స్థలం అందుబాటులోకి వస్తుంది. ఇక్కడైతే బ్యాంకు రుణాలకు ఇబ్బంది ఉండదు. అయితే ఈ అంశాన్ని కనీసం పట్టించుకునే వారు లేరు.

‘మారెళ్లపాడు’ పనుల్లో వేగం పెంచాలి



వనమహోత్సవంలో మొక్క నాటుతున్న మంత్రి తుమ్మల, ఎమ్మెల్యే కూనంనేని, కలెక్టర్ పాటిల్, ఎస్పీ

- ఏడాది దాటినా ఎందుకు ప్రారంభించలేదు..
- అధికారుల తీరుపై మంత్రి తుమ్మల ఆగ్రహం
- భద్రాద్రి ఆలయ అభివృద్ధే లక్ష్యమని స్పష్టీకరణ
- అటవీ సంపద పునరుద్ధరణకు కృషి చేయాలని పిలుపు



రామాలయ మాడవీధుల విస్తరణకు కూల్చివేసిన ఇళ్లను పరిశీలిస్తున్న తుమ్మల, ఎమ్మెల్యే వెంకట్రావు

అశ్వాపురం/భద్రాచలంఅర్బన్/చుంచుపల్లి : సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వకు అనుసంధానంగా అశ్వాపురం మండలం బీజీ కొత్తూరు వద్ద నిర్మిస్తున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనులను తక్షణమే పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ‘నేను వచ్చేదాకా పనులపై పర్యవేక్షణ చేయరా.. అంత సమయం లేదా’ అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేయాలని ఏడాది క్రితమే చెప్పినా.. ఇంతవరకూ ప్రారంభించలేదని మండిపడ్డారు. ఎత్తిపోతల పథకం పనుల పరిశీలనకు సోమవారం వచ్చిన తుమ్మల.. నీటిపారుదల శాఖ స్పెషల్ సెక్రటరీ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌తో ఫోన్‌లో మాట్లాడారు. నాలుగు నెలల్లో పనులు పూర్తి చేసేలా నిర్మాణ సంస్థను ఆదేశించాలన్నారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్ట్ ప్యాకేజీ–1లో భాగంగా మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం ద్వారా తుమ్మలచెరువుకు నీరందించి 16 వేల ఎకరాలు సాగులోకి తెస్తామన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా మొదట పినపాక, ఆ తర్వాత కొత్తగూడెం, అశ్వారావుపేట, వైరా నియోజకవర్గాలకు సాగునీరు అందించే అవకాశం ఉందని, ప్రధాన కాల్వ పనులు పూర్తయ్యాయని, డిస్ట్రిబ్యూటరీ కెనాళ్ల పనులు సాగుతున్నాయని వివరించారు.

రామాలయ అభివృద్ధి నా చిరకాల వాంఛ..

భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయ అభివృద్ధి తన చిరకాల వాంఛ అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాచలం అంబేడ్కర్ సెంటర్‌లో రూ.1.15 కోట్ల వ్యయంతో చేపట్టిన సెంట్రల్ లైటింగ్, డివైడర్ల పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. మాడ వీధుల విస్తరణకు ఇళ్లు తొలగించిన ప్రదేశాన్ని పరిశీలించాక మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి భూసేకరణ ముఖ్యమని తెలియగానే.. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా రూ.33 కోట్లు విడుదల చేశారని చెప్పారు. ఆగమశాస్త్ర పండితుల సూచనల ఆధారంగా పనులు జరుగుతాయన్నారు.

జీవజాతులకు ఉపయోగపడే మొక్కలు నాటాలి..

మనుషులతో పాటు పక్షులు, కోతుల వంటి జీవజాతులకు ఉపయోగపడేలా పండ్ల మొక్కలు విరివిగా నాటేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. లక్ష్మీదేవిపల్లి మండలం అనిశెట్టిపల్లి అటవీ ప్రాంతంలో సోమవారం నిర్వహించిన వనమహోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కోల్పోయిన అటవీ సంపద పునరుద్ధరణకు వనమహోత్సవం నిర్వహించడం హర్షణీయమని అన్నారు. వాతావరణ సమతుల్యత పరిరక్షణకు మొక్కలు నాటడమే ముఖ్యమని చెప్పారు. జిల్లా సమగ్రాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు. అన్ని రవాణా మార్గాలకు కేంద్రంగా జిల్లాను తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ జితేష్ వి పాటిల్, పినపాక, భద్రాచలం, కొత్తగూడెం ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, తెల్లం వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, ఐటీడీఏ పీఓ రాహుల్, డీఎఫ్‌ఓ కిష్టాగౌడ్, ట్రైనీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, ఎస్పీ రోహిత్‌రాజు, నీటిపారుదల శాఖ ఎస్‌ఈలు శ్రీనివాసరెడ్డి, రవికుమార్, ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, జెడ్పీ సీఈఓ నాగలక్ష్మి, భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి రాకతో హడావిడి ..

అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో నిర్మిస్తున్న మారెళ్లపాడు ఎత్తిపోతల పథకం పనుల పరిశీలనకు మంత్రి తుమ్మల సోమవారం రావడంతో అధికారులు హడావిడిగా ఆదివారం పనులు ప్రారంభించారు. శంకుస్థాపన చేసి రెండున్నరేళ్లు గడిచినా ఎర్త్‌వర్క్, బ్లాస్టింగ్ పనులు మాత్రమే చేపట్టారు. పంప్‌హౌస్ నిర్మాణ ప్రధాన పనులు మొదలే కాకపోవడం గమనార్హం.

పొదెం వీరయ్యకు ఆహ్వానమేదీ ?

మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించిన వనమహోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యను అటవీ శాఖ అధికారులు విస్మరించారు. కార్యక్రమానికి ఆహ్వానం పలికేందుకు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో సైతం కనీసం ప్రొటోకాల్ ప్రకారమైనా ఆయనతో పాటు ఎంపీ రఘురాంరెడ్డి ఫొటో పెట్టకపోవడాన్ని పలువురు తప్పుపడుతున్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు అందాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



దరఖాస్తుదారుల సమస్యలు తెలుసుకుంటున్న పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: అర్హులైన గిరిజనులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా అధికారులు కృషి చేయాలని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ సూచించారు. ఐటీడీఏ ప్రాంగణంలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గిరిజనుల దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలని అన్నారు. మత్స్య సొసైటీల ఏర్పాటు, ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాలు, పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, భూ సమస్యలు, స్వయం ఉపాధి పథకాల రుణాలు, పట్టా భూములకు రైతుబంధు, పోడు పట్టాల్లో పేర్ల మార్పు తదితర అంశాలపై పలువురు దరఖాస్తులు సమర్పించారని వివరించారు. గిరిజన దర్బార్‌లో వచ్చిన ఆర్జీలన్నీ ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేయాలని, అర్హులైన ప్రతి గిరిజన కుటుంబానికీ విడతల వారీగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించేలా చర్యలు చేపడతామని చెప్పారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, ఆర్సీఓ అరుణ కుమారి, ఉద్యానవనాధికారి ఉదయ్‌కుమార్, ఈఈ హరీష్, రాజారావు, ఆదినారాయణ, చంద్రకళ, భార్గవి, చలపతి, రామ్ కుమార్, మోహన్, స్వాతి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ వేణుగోపాల్



ప్రజావాణిలో సమస్యలు తెలుసుకుంటున్న వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజావాణిలో వచ్చిన ప్రతీ దరఖాస్తును నిశితంగా పరిశీలించి పరిష్కరించాలని అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించి, పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజావాణిలో ఫిర్యాదు చేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో సుదూర ప్రాంతాల నుంచి వస్తుంటారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అధికారులు వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన తదితరులు పాల్గొన్నారు. కాగా, జిల్లాలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కార్యక్రమాలు ఉండడంతో కలెక్టర్‌తో పాటు కొందరు జిల్లా స్థాయి అధికారులు ప్రజావాణికి హాజరు కాలేదు. ఇక మోహర్రం పండుగ, వ్యవసాయ సీజన్ కావడంతో ఫిర్యాదుదారులు కూడా అంతంతమాత్రంగానే వచ్చారు.

విద్యుదుత్పత్తిపై ముందస్తు ప్రణాళిక ఉండాలి

జెన్‌కో డైరెక్టర్ రాజశేఖర్ రెడ్డి



ఉత్పత్తి తీరును పరిశీలిస్తున్న రాజశేఖర్ రెడ్డి

పాల్వంచ: విద్యుత్ ఉత్పత్తి కోసం ముందస్తు ప్రణాళిక ఉండాలని టీజీ జెన్‌కో డైరెక్టర్(థర్మల్) వై.రాజశేఖర్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన కేటీపీఎస్ 5, 6 దశల కర్మాగారంలో డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.లక్ష్మణ్, జనరేషన్ సీఈ పి.రత్నాకర్‌తో కలిసి కోల్ ప్లాంట్, వ్యాగన్ టిప్లర్, బీటీబీఆర్‌లో పర్యటించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. వర్షాకాలంలో విద్యుత్ ఉత్పత్తికి ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని సూచించారు. కార్యక్రమంలో కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు. కాగా, విద్యుత్ సంస్థల్లో ఇంజనీర్లకు బదిలీ పాలసీ రూపొందించాలని పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ల నాయకులు డైరెక్టర్లు రాజశేఖర్‌రెడ్డి, లక్ష్మయ్యకు వినతిపత్రం అందించారు. ఖాళీగా ఉన్న ఏఈ పోస్టులు భర్తీ చేయాలని, కేటీపీఎస్‌లో నూతన కర్మాగారం, క్వార్టర్లు నిర్మించాలని, పింఛన్ పాలసీ అమలు చేయడంతో పాటు పీఎల్‌ఎఫ్ పాలసీ అలవెన్స్ మంజూరు చేయాలని నాయకులు ఉమామహేశ్వరరావు, సంపత్, రాజేష్, రాజబాబు, చంద్రకళాధర్, అరుణ్, నరేందర్, రామారావు, కృష్ణ, అక్బర్, వెంకట్రావు తదితరులు కోరారు.

సబ్‌స్టేషన్లకు అదనపు లైన్లు

ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ మహేందర్

చంద్రుగొండ : జిల్లాలోని విద్యుత్ సబ్‌స్టేషన్లకు అదనంగా రెండో లైన్ల నిర్మాణాలు చేపడుతున్నట్లు ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ జి.మహేందర్ తెలిపారు. చంద్రుగొండ సబ్‌స్టేషన్‌కు నిర్మిస్తున్న రెండో లైన్ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. జిల్లాలో 71 విద్యుత్ సబ్‌స్టేషన్లు ఉన్నాయని, వాటిలో 9 స్టేషన్ల లైన్ పనులు పూర్తి చేశామని చెప్పారు. మరో 12 కేంద్రాల్లో పనులు జరుగుతున్నాయని, 21 కేంద్రాలకు రెండో లైన్ నిర్మించే అవకాశం లేదని వివరించారు. మొదటి లైన్‌లో సాంకేతిక లోపాలు నెలకొంటే రెండోలైన్ ద్వారా విద్యుత్ సరఫరా చేస్తామన్నారు. జిల్లాలో 183 కిలోమీటర్ల వరకు రెండో విద్యుత్ లైన్ పనులు చేపట్టామని చెప్పారు. ఆయన వెంట డీఈలు నందయ్య, వెంకటేశ్వర్లు, ఏడీఈ యాసీన్ ఉన్నారు.

కస్తూర్బాల్లో పుస్తకాల్లేవ్ !

- ఇంటర్ విద్యార్థులకు నేటికీ అందని వైనం
- పాత పుస్తకాలతోనే నెట్టుకొస్తున్న బాలికలు
- విద్యాశాఖ నిర్లక్ష్యంపై సర్వత్రా విమర్శలు



పినపాక కేజీబీవీలో పాత పుస్తకాలతో చదువుతున్న విద్యార్థినులు

కరకగూడెం: గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల బాలికలకు విద్యనందించడంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు(కేజీబీవీ) కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటిలో ప్రాథమిక స్థాయి నుంచి ఇంటర్ వరకు బోధన సాగుతోంది. ఇంటర్ బోర్డు నిర్దేశించిన సిలబస్‌ను అనుసరించి తెలుగు అకాడమీ, స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రెనింగ్ ద్వారా ప్రచురితమైన పుస్తకాలను ఇక్కడ బోధిస్తుండగా ఇవి ఇంగ్లిష్ మీడియంలో ఉంటాయి. అయితే ప్రస్తుత విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు దాటినా ఇంటర్ విద్యార్థినులకు ఇప్పటికీ కొత్త పాఠ్యపుస్తకాలు అందలేదు. దీంతో పాత పుస్తకాలతో చదువు కొనసాగిస్తున్నారు. జిల్లాలో పాల్వంచ, టేకులపల్లి, బూర్గంపాడు, గుండాల, ఆళ్లపల్లి, కరకగూడెం, ములకలపల్లి, చంద్రుగొండ, భద్రాచలం, దుమ్ముగూడెం, అన్నపురెడ్డిపల్లి, జూలూరుపాడు, చర్ల, పినపాక మండలాల్లో మొత్తం 14 కేజీబీవీలు ఉండగా 1,310 మంది ఇంటర్ విద్యనభ్యసిస్తున్నారు.

పేద విద్యార్థినులపై నిర్లక్ష్యమా..

విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు దాటినా కేజీబీవీల్లో ఇంటర్ పుస్తకాలు సరఫరా చేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విద్యావేత్తలు, విద్యార్థి సంఘాల నాయకులు విమర్శిస్తున్నారు. ప్రణాళిక, సమన్వయ లోపంతోనే ఇలాంటి సమస్యలు తలెత్తుతున్నాయని అంటున్నారు. కస్తూర్బా విద్యాలయాల్లో నిరుపేద విద్యార్థినులే ఎక్కువగా చేరుతుంటారని, వారి భవిష్యత్‌తో ప్రభుత్వం ఆడుకోవద్దని కోరుతున్నారు.

అభ్యసనంపై ప్రభావం..

కస్తూర్బా విద్యాలయాల్లో ఇంటర్ విద్యార్థినులకు పుస్తకాలు అందకపోవడంతో అభ్యసనంపై తీవ్ర ప్రభావం పడుతోంది. పాఠాలను అర్థం చేసుకోవడం, నోట్స్ రాసుకోవడంలో తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారు. అధ్యాపకులు చెప్పిన పాఠాలు వినడం తప్ప వాటిని తిరిగి సాధన చేయలేకపోతున్నామని బాలికలు అంటున్నారు. కొత్త పుస్తకాలు రాకపోవడంతో గతేడాది చదివిన విద్యార్థినుల పాత పుస్తకాలపై ఆధారపడాల్సి వస్తోందని వాపోతున్నారు. తమ పిల్లలకు పుస్తకాలు కొనుగోలు చేసే ఆర్థిక స్తోమత లేదని, ప్రభుత్వమే త్వరగా పుస్తకాలు పంపిణీ చేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పుస్తకాలు లేక అర్థం కావడం లేదు



పుస్తకాలు లేకపోవడంతో లెక్చరర్లు చెప్పే పాఠాలు సరిగా అర్థం కావడం లేదు. పాఠం చెప్పాక తిరిగి చదువుకోవడానికి, నోట్స్ రాసుకోవడానికి కష్టంగా ఉంది. పాత పుస్తకాలు ఇచ్చినా ఇబ్బందులు తప్పడం లేదు. త్వరగా కొత్త పుస్తకాలు ఇవ్వాలి.

– ఎం.లావణ్య, ఇంటర్ ఫస్టియర్, కేజీబీవీ భట్టుపల్లి

త్వరలోనే అందజేస్తాం..



కస్తూర్బా విద్యార్థినిలకు పుస్తకాల సరఫరాలో జాప్యం జరిగింది నిజమే. సాంకేతిక కారణాలు, ప్రింటింగ్ ప్రక్రియలో ఆలస్యమైంది. సమస్య పరిష్కారానికి ఉన్నతాధికారులు కృషి చేస్తున్నారు. త్వరలోనే అన్ని కస్తూర్బా విద్యాలయాలకు పుస్తకాలను అందజేస్తాం. ప్రస్తుతం వారి అభ్యసనానికి ఎలాంటి ఆటంకం కలగకుండా చూస్తున్నాం. – అన్నామణి, జీసీడీఓ

క్లుప్తంగా

రామయ్య భూముల్లో అక్రమంగా నిర్మాణం


ఆలయ సిబ్బందితో ఆక్రమణదారుల వాగ్వాదం

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థాన భూముల ఆక్రమ కొనసాగుతోంది. పట్టణ సరిహద్దులోని ఏపీ పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న దేవస్థాన భూముల్లో కొందరు ఆక్రమణదారులు సోమవారం ఇంటి నిర్మాణ పనులు ప్రారంభించారు. ఆలయ అధికారులు, సిబ్బంది వెళ్లి అడ్డుకోవడంతో స్వల్ప ఘర్షణ జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ఏఈఓ భవాని రామకృష్ణ మాట్లాడుతూ ఏపీ హైకోర్టు పురుషోత్తపట్నంలోని 889.50 ఎకరాల ఆలయ భూములను దేవస్థానానికి అప్పగించాలని న్యాయస్థానం అధికారులకు ఉత్తర్వులు జారీ చేసినా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదని పేర్కొన్నారు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు అధికారులు హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం దేవస్థాన భూములను ఆక్రమించిన వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

కోకో పంటకు ఉద్యాన శాఖ రాయితీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి కోకో పంటకు కూడా ఉద్యాన శాఖ రాయితీ లభిస్తుందని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖాధికారి జంగా కిషోర్ తెలిపారు. సోమవారం ఆయన వివరాలు వెల్లడించారు. ఈ పంటకు సెమీ షేడ్ అవసరమైనందున ఆయిల్‌పామ్, కొబ్బరి తోటల్లో అంతర పంటగా సాగు చేసుకోవచ్చని సూచించారు. హెక్టార్‌కు 500 మొక్కలు అవసరమవుతాయని తెలిపారు. మొదటి సంవత్సరం హెక్టారుకు రూ.18 వేలు, రెండో సంవత్సరం రూ. 12 వేలు.. మొత్తం రూ.30 వేలు ఉద్యాన శాఖ ద్వారా మంజూరు చేస్తామని వివరించారు. ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అన్నపై తమ్ముడి హత్యాయత్నం

టేకులపల్లి: భూవివాదం కారణంగా అన్నపై తమ్ముడు హత్యాయత్నానికి పాల్పడిన ఘటన సోమవారం రాత్రి టేకులపల్లిలో చోటుచేసుకుంది. మండలంలోని మూడు తండాకు చెందిన గుగులోత్ రవి సోమవారం రాత్రి టేకులపల్లి జీపీ ఆఫీసు సెంటర్‌లోని బేకరీ వద్దకు వెళ్లాడు. ఆయన తమ్ముడు (బాబాయి కొడుకు) గుగులోత్ వినోద్‌కుమార్ కూడా రావడంతో ఇటీవల విక్రయించిన గుంటన్నర భూమి విషయమై వాగ్వాదం జరిగింది. దీంతో వినోద్ కత్తితో రవిని బలంగా పొడవగా గాయాలయ్యాయి. ఆపై వినోద్ పారిపోగా, రవిని కొత్తగూడెంలోని ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలియడంతో ఎస్‌ఐ రాజేందర్, సిబ్బందితో చేరుకుని విచారణ చేపట్టారు. కాగా, అదే సమయంలో వినోద్ భార్య అటు వైపు రాగా స్థానికులు దేహశుద్ధి చేస్తుండడంతో ఎస్‌ఐ ఆమెను పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా వినోద్‌కుమార్ కత్తి తీసుకుని సెంటర్‌కు వెళ్లి తన స్నేహితులతో రవిని పిలిపించి హత్యాయత్నానికి పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. మరో వైపు ఇద్దరి మధ్య రూ.2.50లక్షల నగదు వివాదంతో దాడి జరిగిందని ఇంకొందరు చెబుతున్నారు.

అదుపుతప్పి లారీ బోల్తా

అశ్వారావుపేటరూరల్: ఓ లారీ అదుపుతప్పి బోల్తా పడిన ఘటన సోమవారం అశ్వారావుపేటలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా హాలియా నుంచి కోల్‌కతాకు బత్తాయి కాయల లోడుతో వెళ్తున్న లారీ వ్యవసాయ కళాశాల వద్ద ఎదురుగా వచ్చే మరో వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. లారీ స్వల్పంగా ధ్వంసం కాగా, దాంట్లో ఉన్న బత్తాయి కాయలు దెబ్బతిన్నాయి.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.17,463

'మహిళా కోష్'తో వణుకు!

- 2006లో ఢిల్లీ ఎన్‌జీఓ నుంచి రూ. 7 కోట్ల రుణాలు..
- ఉమ్మడి జిల్లాలో 14 మండలాల్లోని మహిళా సమాఖ్యలకు మంజూరు
- రుణాల రికవరీకి అక్కడి కోర్టు నుంచి తరచూ నోటీసుల జారీ
- తాజాగా మరోసారి నోటీసు రావడంతో మహిళా సమాఖ్యల ఆందోళన


చంద్రుగొండలోని సెర్ప్ కార్యాలయం

చంద్రుగొండ: మహిళా సమాఖ్యల రుణాల రికవరీపై ఢిల్లీకి చెందిన ఎన్‌జీఓ రాష్ట్రీయ మహిళాకోష్ సీరియస్‌గా పావులు కదుపుతోంది. తాజాగా మండల సమాఖ్య బాధ్యులకు శుక్రవారం నోటీసులు రావడంతో ఈ సమస్య మళ్లీ తెరపైకి వచ్చింది. దీంతో మహిళా సంఘాల్లో వణుకు పుడుతోంది. సెర్ప్ అధికారుల నిర్లక్ష్యం వల్ల మహిళా సంఘాల సభ్యులు మనోవేదన చెందుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 2006 ఏడాది రాష్ట్రీయ మహిళాకోష్ సంస్థ 14 మండలాల్లో మహిళా సమాఖ్యలకు రూ. 7 కోట్ల రుణాలను మంజూరు చేసింది. చంద్రుగొండ, కొత్తగూడెం, ములకలపల్లి, దమ్మపేట, సత్తుపల్లి, మధిర, వేంసూరు, బోనకల్, చింతకాని, గార్ల, కామేపల్లి, ఖమ్మం రూరల్, ముదిగొండ, తిరుమలాయపాలెం మండలాల్లో ఒక్కో మండలానికి రూ. 50 లక్షల చొప్పున రుణాలను రెండు విడతలుగా ఇచ్చారు. అప్పట్లోనే సదరు నిధుల నుంచి ఒక్కో గ్రామ సమాఖ్యకు రూ. 1.5 లక్షల నుండి రూ. 3 లక్షల వరకు రుణాలను పంపిణీ చేశారు. 2011 ఏడాది వరకు సక్రమంగానే వాయిదాలు చెల్లించారు. రుణాల నిధుల కేటాయింపు సమయంలో ఎన్‌జీఓ మండల సమాఖ్య అధ్యక్ష,కార్యదర్శుల తోపాటు కోశాధికారిని ఢిల్లీ పిలిపించి వారినే బాధ్యులను చేస్తూ రుణ మొత్తాలను అప్పగించింది. 2011 ఏడాది తర్వాత మండల సమాఖ్యలకు ఎన్నికలు జరిగాయి. అప్పుడు ఉన్న మండల సమాఖ్య బాధ్యుల స్థానంలో కొత్తవారు ఎన్నికయ్యారు. దీంతోపాటు అప్పటి ఇందిరాక్రాంతి పథం అధికారులు, సిబ్బంది బదిలీపై వెళ్లిపోయారు. దీంతో రాష్ట్రీయ మహిళాకోష్ రుణాలు వాయిదాల చెల్లింపులను ఎవరూ పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఎన్‌జీఓ అక్కడి మెట్రోపాలిటిన్ కోర్టును ఆశ్రయించింది. 2014 ఏడాది కోర్టు ఆదేశాల మేరకు ఢిల్లీ పోలీసులు మండల సమాఖ్య మహిళల ఇళ్లకు వచ్చి నోటీసులు ఇచ్చారు. అప్పటి నుంచే కేసు సాగుతూ వచ్చింది. తాజాగా ఢిల్లీకి చెందిన మెట్రో పాలిటన్ మెజిస్ట్రేట్ మహిళా సంఘాలకు మరో మారు నోటీసులు జారీ చేశారు. దీంతో సమాఖ్య మహిళలు ఆందోళన చెందుతున్నారు.

రికవరీ నిధులు గోల్‌మాల్ చేశారా?

2011 ఏడాది తర్వాత రికవరీ ఎందుకు ఆగిపోయిందంటే.. ప్రస్తుతం ఉన్న అధికారుల నుంచి ఎలాంటి సమాధానమూ లేదు. రికవరీ సొమ్మును అప్పటి అధికారులు, సిబ్బంది కాజేశారా ? లేదా గ్రామసమాఖ్యలే కట్టలేదా? అనే విషయం కూడా తేలని పరిస్థితి ఉంది. ఇందుకు సంబంధించిన ఎలాంటి రికార్డులు కూడా ప్రస్తుతం సెర్ప్ అధికారుల వద్ద లేకపోవడం గమనార్హం.

భారీగా వడ్డీ భారం

మహిళా సమాఖ్యలు తీసుకున్న రాష్ట్రీయ మహిళాకోష్ రుణాల వడ్డీ ప్రస్తుతం తడిసి మోపెడైంది. చంద్రుగొండ మండలానికి అప్పట్లో 32 సంఘాలకు రూ. 50 లక్షలు రుణాలు ఇచ్చారు. అందులో 2011 ఏడాది వరకు రూ. 37 లక్షలు తిరిగి చెల్లించారు. అందులో రూ. 13 లక్షల వరకు అసలు చెల్లించాల్సి ఉంది. ప్రస్తుతం వడ్డీతో మొత్తం రూ. 60 లక్షలకు చేరుకుంది. ఇదే పరిస్థితి ఉమ్మడిజిల్లాలోని మిగిలిన 13 మండలాల్లో కూడా నెలకొంది.

ఆత్మహత్యే శరణ్యం



తరచూ పోలీసులు ఇంటికి రావడంతో పరువుపోతోంది. ఆత్మహత్యే శరణ్యంగా మారింది. రూ. లక్షలు చెల్లించాలని ఢిల్లీ కోర్టు నుంచి నోటీసులు వస్తున్నాయి. తాజాగా మరో నోటీసు వచ్చింది. కూలిపనులు చేసుకునే జీవించే మేము ఢిల్లీ కోర్టు చుట్టూ ఎలా తిరగగలం. – తంబళ్ల సీతమ్మ, మండల సమాఖ్య మాజీ అధ్యక్షురాలు, చంద్రుగొండ

ఆందోళనగా ఉంది



ఏం జరుగుతుందోనని ఆందోళనగా ఉంది. అప్పుడు గ్రామ సమాఖ్యలకు ఇచ్చిన రుణాలు చెల్లించేందుకు మమ్మల్ని బాధ్యులను చేశారు. సత్వరమే చెల్లించకుంటే జైలుకు వెళ్లాల్సి వస్తుందని చెప్తున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.
– పి.కాంతకుమారి, మండల సమాఖ్య కోశాధికారి, కట్టుగూడెం, అన్నపురెడ్డిపల్లి మండలం

అధికారులకు నివేదించాం



ఢిల్లీకి చెందిన ఎన్‌జీఓ సంస్థ రాష్ట్రీయ మహిళా కోష్ రుణాల రికవరీకి సంబంధించిన సమస్య సీరియస్‌గా ఉన్న మాట వాస్తవమే. సమస్య తీవ్రతను జిల్లా అధికారులకు నివేదించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.
– సంతోష్‌కుమార్, సెర్ప్ ఏపీఎం

మళ్లీ మొదటికొచ్చిన నిర్వాసితుడి సమస్య

- ఎమ్మెల్యే చొరవతో గత ఏడాది భూకేటాయింపు..
- సాగును అడ్డుకున్న సింగరేణి అధికారులు


సుందర్‌లాల్

ఇల్లెందు: సింగరేణి నిర్వాసితుడు, ఇల్లెందుకు చెందిన సుందర్‌లాల్ లోధ్ భూ సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. ఏడేళ్ల పాటు ఆయన పోరాడగా గత ఏడాది ఆగస్టులో ఎమ్మెల్యే కోరం కనకయ్య హామీతో భూమి కేటాయించారు. అయితే, సదరు భూమిలో సాగు పనులను సింగరేణి అధికారులు అడ్డుకోవడంతో మళ్లీ సమస్య మొదలైంది. తాతముత్తాల నుంచి సంక్రమించిన భూమిలో సింగరేణి ఓసీ ఏర్పాటు చేసినా తనకు పరిహారం చెల్లించకపోగా, పని కూడా కల్పించలేదని ఇల్లెందుకు చెందిన సుందర్‌లాల్ ఏళ్ల తరబడి నిరసన తెలిపారు. ఎడ్లబండిపై ఇసుక తీసుకొచ్చి అమ్ముతూ జీవనం సాగించే ఆయన అదే బండికి బ్యానర్లు కట్టి నిరసన కొనసాగించాడు. మూడేళ్ల క్రితం ఎడ్లబండితో ప్రగతిభవన్‌కు బయల్దేరగా పోలీసులు అడ్డుకోవడంతో బస్సులో వెళ్లి తన ఆవేదన వివరించారు. ఆపై ఓసారి సెల్ టవర్ ఎక్కడం, మరో మారు సుందర్‌లాల్ కుమారుడు సంజయ్ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టారు. ఆపై 2022 డిసెంబర్‌లో జీఎం కార్యాలయం వద్ద ఎడ్లబండిని నిలిపి ఎద్దులతో మూత్రం పోయించాడని కేసు పెట్టడంతో జరిమానా విధించారు. చివరకు గత ఏడాది ఆగస్టులో సంజయ్ దేశంలో జీవించే అవకాశం లేదంటూ నేపాల్‌కు పయనమై మార్గమధ్యలో చిత్రీకరించిన వీడియో వైరల్‌గా మారింది. దీంతో ఎమ్మెల్యే కనకయ్య ఆయనతో ఫోన్‌లో మాట్లాడి వెనక్కి రప్పించారు. ఆపై ఇల్లెందు – కారేపల్లి బైపాస్ రోడ్‌లో సోలార్ ప్లాంట్ ఎదుట ఆరు ఎకరాల భూమి చూపించగా అందులో సాగుపనులు మొదలుపెట్టాడు. కానీ సింగరేణి అధికారులు అక్కడ సాగు చేయొద్దని అడ్డుకోవడంతో చేసేదేం లేక సోమవారం ఇల్లెందులోని ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి తన గోడు వెళ్లబోసుకున్నాడు. ఏళ్లనాటి తమ సమస్యకు శాశ్వ త పరిష్కారం చూపించాలని కోరాడు.

దుగినేపల్లి వాసికి డాక్టరేట్



గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న చందర్‌రావు

పినపాక: పినపాక మండలంలోని దుగినేపల్లికి చెందిన పంతగాని చందర్‌రావు సోమవారం వరంగల్‌లో జరిగిన కాకతీయ యూనివర్సిటీ స్నాతకోత్సవంలో డాక్టరేట్ అందుకున్నారు. ఫిజిక్స్ విభాగంలో ఆయన సమర్పించిన పరిశోధనాత్మక పత్రానికి డాక్టరేట్ ప్రకటించగా, యూనివర్సిటీ చాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, వీసీ ప్రతాప్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు పలువురు చందర్‌రావును అభినందించారు.

కాశేశ్వరరావుకు...


కాశేశ్వరరావు

పాల్వంచరూరల్: మండలంలోని కిన్నెరసానికి చెందిన మంత్రి సూర్యప్రకాశ్ రావు – సువర్ణాదేవి దంపతుల కుమారుడైన కాశేశ్వరరావు అర్థశాస్త్ర విభాగంలో డాక్టరేట్ సాధించారు. వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయంలో జరిగిన స్నాతకోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా ఆయన డాక్టరేట్ అందుకున్నారు.

భద్రాచలం వాసి మంజులాదేవికి...


డాక్టరేట్ అందుకుంటున్న మంజులాదేవి

భద్రాచలంటౌన్: భద్రాచలంకు చెందిన బుడగం మంజులాదేవి 'సాహిత అకాడమీ అవార్డు విన్నింగ్ నోవెల్స్ – స్టడీ ఆఫ్ సెలెక్ట్ ఇంగ్లిష్ నొవెల్స్' అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక గ్రంథానికి డాక్టరేట్ ప్రకటించారు. ఈ సందర్భంగా కేయూలో సోమవారం జరిగిన స్నాతకోత్సవంలో ఆమె గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు.

దుమ్ముగూడెం వాసికి బంగారు పతకాలు


కనకదుర్గ

దుమ్ముగూడెం: దుమ్ముగూడెనికి లంక కనకదుర్గ కేయూ స్నాతకోత్సవంలో చాన్స్‌లర్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా మూడు బంగారు పతకాలు అందుకున్నారు. ఎమ్మెస్సీ గణితం పూర్తిచేసిన ఆమె బంగారు పతకాలు అందుకోగా కుటుంబీకులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ముగ్గురికి గాయాలు

దమ్మపేట: రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురు గాయపడ్డ ఘటన దమ్మపేట డీసీసీ బ్యాంక్ సమీపంలో సోమవారం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... మండలంలోని లింగాలపల్లికి చెందిన ఎస్.సీతారాములు బైక్‌పై దమ్మపేటకు వస్తున్నాడు. అదే సమయంలో నారంవారిగూడేనికి చెందిన నారం రాజు, నాగు మరో బైక్‌పై వస్తున్నారు. ఈ క్రమంలో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.



విద్యుత్ కోతలపై ఆందోళన


విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న భేతాళపాడు గ్రామస్తులు

జూలూరుపాడు: అప్రకటిత విద్యుత్ కోతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ భేతాళపాడు గ్రామస్తులు జూలూరుపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొద్ది రోజులుగా అప్రకటిత విద్యుత్ కోతలతో నరకయాతన పడుతున్నామని అన్నారు. రాత్రి వేళలో ఏ కొద్దిపాటి వర్షం కురిసినా కరెంట్ పోతుందని పేర్కొన్నారు. విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఆందోళనకు సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు శ్రీధర్, మండల కార్యదర్శి యాసా నరేష్‌లు సంఘీభావం తెలి పారు. నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేస్తామని జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఇన్‌చార్జి ఏఈ నరసింహారావు హామీ ఇవ్వడంతో ప్రజలు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు రెడ్డిబోయిన గోవిందు, శ్రీను, చలమల నరసింహారావు, రెడ్డిబోయిన నవీన్, చౌడం సాయికుమార్, ధరావత్ బాల కిషన్, నాగభూషణం, గుగులోత్ భాస్కర్, బానోత్ సుగుణరావు, వెంకటేష్, రేగళ్ల సీతయ్య, తదితరులు పాల్గొన్నారు.

92 కేజీల గంజాయి స్వాధీనం


పామాయిల్ క్షేత్రంలో గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

దమ్మపేట: మండలంలోని అచ్యుతాపురం గ్రామ శివారులో ఉన్న పామాయిల్ క్షేత్రంలో దాచి ఉంచిన గంజాయి ప్యాకెట్లను సోమవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దమ్మపేట ఎస్సై సాయికిషోర్ రెడ్డి కథనం ప్రకారం... అశ్వారావుపేట మండలంలోని అచ్యుతాపురం గ్రామానికి చెందిన గుజ్జుల వెంకటేశ్వరరావుకు దమ్మపేట అర్బన్ కాలనీ శివారులో పామాయిల్ తోట ఉంది. సోమవారం వెంకటేశ్వరరావు తోటకు వెళ్లగా గంజాయి ప్యాకెట్లు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం అందించగా, వారు వచ్చి 92 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి విలువ రూ.46,17,500 ఉంటుందని, ప్యాకెట్లను తోటలో దాచి ఉంచిన ముద్దాయిల కోసం విచారణ చేపట్టామని ఎస్‌ఐ తెలిపారు.

మావోయిస్టులతో అభివృద్ధికి ఆటంకం


గొత్తికోయ గ్రామస్తులతో పోలీసులు

కరకగూడెం: అభివృద్ధికి ఆటంకం మావోయిస్టులేనని జిల్లా అడిషనల్ ఎస్పీ నరేందర్ పేర్కొన్నారు. మండలంలోని రేగళ్ల గొత్తికోయ గ్రామంలో సోమవారం కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మావో యిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీ లకు పోలీస్‌శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మా వోయిస్టులకు సహకరించొద్దని, వారి మాయమాటలు నమ్మి మోస పోవద్దని హెచ్చరించారు. అనంతరం చిన్న పిల్లలకు పలకలు, పుస్తకాలు, మహిళలకు నిత్యావసర వస్తువులు, యువతకు వాలీబాల్ కిట్లు అందజేశారు. పొలం పనులకు వెళ్లే మహిళలకు ప్లాస్టిక్ రైన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు, కరకగూడెం ఎస్సై పీవీఎన్.రావు పాల్గొన్నారు.

బ్రాంచ్ పోస్టుమాస్టర్ అరెస్ట్

అశ్వాపురం: మండల పరిధిలోని నెల్లిపాకబంజర బ్రాంచ్ పోస్టుమాస్టర్‌గా పని చేసిన జాటోత్ వెంకటేష్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు. అతను పోస్టుమాస్టర్‌గా పని చేసిన కాలంలో ఖాతాదారుల డబ్బులు సుమారు రూ.23 లక్షలను దుర్వినియోగం చేసినట్టు తపాలా శాఖ అధికారుల దర్యాప్తులో తేలింది. దీంతో గతంలోనే సస్పెండ్ చేశారు. తాజాగా ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ వట్టి వీరభద్రస్వామి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రణీత్‌కుమార్ (ఫైల్)

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ హనుమంతులపాడు గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బొజ్జాయిగూడెం గ్రామపంచాయతీ కొల్లాపురం గ్రామానికి చెందిన ప్రణీత్‌కుమార్ (24), స్నేహితుడు కుంజ జలమయ్య బైక్‌పై కొత్తూరు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో హనుమంతులపాడు గ్రామంలో ఆగి ఉన్న బోర్‌వెల్ వాహనాన్ని బైక్ ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు ఇల్లెందు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రణీత్ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, జలమయ్య చికిత్స పొందుతున్నాడు.

చంద్రుగొండలో ఒకరు..

చంద్రుగొండ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం .. మండలంలోని తిప్పనపల్లి తండాకు చెందిన తేజావత్ రమేష్ అలియాస్ గోపి (35) ఆదివారం రాత్రి కిరాణషాపునకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో చంద్రుగొండ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన గోపిని కొత్తగూడెం చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తమ్ముడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొత్తగూడెంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పురుగుల మందు తాగి యువకుడి ఆత్మహత్య


పూనెం వంశీ (ఫైల్)

ఇల్లెందురూరల్: అమ్మ డబ్బులివ్వలేదని క్షణికావేశానికి గురై ఓ యువకుడు పురుగుల మందు తాగి సోమవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని కొల్లాపురం గ్రామానికి చెందిన పూనెం వంశీ (23) అతిగా మద్యం తాగుతున్నాడు. సోమవారం డబ్బుల కోసం తల్లితో ఘర్షణ పడి క్షణికావేశంలో ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి కలుపు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఇల్లెందు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పర్ణశాలలో అభివృద్ధి పనులు

- ప్రసాద్ పథకంలో నిధులు కేటాయించిన కేంద్ర ప్రభుత్వం
- కొనసాగుతున్న కాటేజీ, బయో టాయిలెట్ల నిర్మాణం


పర్ణశాల శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం

దుమ్ముగూడెం: భద్రాచలం శ్రీ సీతారాముల దేవస్థానం అనుబంధ ఆలయం పర్ణశాలకు ప్రసాద్ పథకంతో మహర్దశ పట్టనుంది. కేంద్ర ప్రభుత్వం పిలిగ్రిమేజ్ రెజువెనేషన్ అండ్ స్పిర్చువల్ అగ్మెంటేషన్(ప్రసాద్) పథకం కింద పర్ణశాల రామాలయ అభివృద్ధికి నిధులు కేటాయించింది. దీంతో కాటేజీల నిర్మాణ పనులు చేపట్టగా ప్రస్తుతానికి గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం స్లాబ్ లెవల్ వరకు పూర్తయింది. నార చీరల ప్రాంతం వద్ద బయో టాయిలెట్లు నిర్మిస్తున్నారు. ఆలయంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి భద్రాచలం ప్రధాన ఆలయానికి అనుసంధానం చేశారు. పనులు పూర్తయితే పర్ణశాల ఆలయంతోపాటు గ్రామ రూపురేఖలు సైతం మారనున్నాయి.

రూ.4 కోట్లు కేటాయింపు

పర్ణశాల అభివృద్ధికి గతంలో కేటాయించిన నిధులతో నిర్మాణ పనులు జరుగుతుండగా భద్రాచలం ఆలయానికి కేటాయించిన నిధుల్లో మిగిలిన మరో రూ.4 కోట్లను పర్ణశాలకు మళ్లించారు. ఆ నిధులతో ఓపెన్ షెడ్ నిర్మాణం, ఆలయ ఆవరణలో గ్రానైట్ రాయితో ఫ్లోరింగ్ పనులు చేపట్టారు. భక్తులు వేచి ఉండేందుకు, భవిష్యత్‌లో ఏర్పాటు చేయబోయే అన్నదానం కార్యక్రమానికి అనువుగా మరో రెండు షెడ్లను నిర్మించనున్నారు. గ్రామం చుట్టూ హైమాస్ట్ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయనున్నారు. శ్రీ సీతారామలక్ష్మణులు 14 ఏళ్లపాటు పంచవటీ కుటీరం ఏర్పాటు చేసుకుని వనవాసం చేసిన పుణ్యస్థలం పర్ణశాలలో అభివృద్ధిపనులు సాగుతుడటంతో భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పనులన్నీ సజావుగా పూర్తయితే భక్తుల రద్దీ, ఆలయానికి ఆదాయం పెరిగే అవకాశంఉంది.

వ్యాపారం పెరుగుతుంది..



పర్ణశాలలో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయితే భక్తుల తాకిడి పెరుగుతుంది. దీంతో వ్యాపారాలు సైతం మంచిగా సాగుతాయి. భక్తులు రాత్రి పూట సేద తీరేలా ఉండేందుకు కూడా నిర్మాణాలు చేపట్టాలి.
–గోసంగి నరసింహారావు, పర్ణశాల గ్రామస్తుడు

సాక్షి క్లాసిఫైడ్స్

Education

DISTANCE EDUCATION

■ మావద్ద ఓపెన్ 10th ఇంటర్, డిగ్రీ, పీజీ, MBA, MCA, B.Tech, LLB, ITI, డిప్లొమా, ఫార్మసీ, B.Sc, (Agree), HPT, B.Ed, B.PEd, అడ్మిషన్లకై సం.ప్ర. 99481 31154 [SCA 25005912]

Wanted

■ ఖమ్మం పట్టణం నందు పని చేయుటకు అనుభవం ఉన్న కార్ డ్రైవర్స్ వెంటనే కావలెను. ఆకర్షణీయమైన జీతం కలదు. వివరాలకు సంప్ర. సెల్ : 9959692157 [SCA 25006042]

■ Wanted AO Female (Fluency English+ School Experience Must, New Victory Talent School, Guttala Bazar, Khammam. Cell : 95539 97127, 98494 88973. [SCA 25006034]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్. జీ : 18K. Ph: 9848571888, 9640400073 [SCA25005909]

■ Required Field Executives for Electronic Goods Procurement from stores. Ph.No: 9133399257, 9703333378 [G-145]

■ రామకృష్ణ ఓల్డేజ్ హోం (AP NO-1) VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు, ఇంటి/వంట పని, బేబీ కేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో + వ + జీ 16-18 వేలు. ఏజెంట్ల కమీషన్ 5000/- ✆ 92814 52827, 92814 52838 [B-1275575]

■ రామకృష్ణ ఓల్డేజ్‌హోం నాగోల్ Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/పేషెంట్ల సేవ వంట/ఇంటిపని బేబికేర్ కై M/F వర్కర్స్ కా॥ భో+వసతి + జీతం: 16–18 వేలు ఏజెంట్లకు 5వేలు కమీషన్ ఫోన్ : 9281465319, 9010680011 [SCA25005822]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి

వివరాలకు :

ఖమ్మం	: 9010299957
	9705444182
పాల్వంచ	: 9705444183
భద్రాచలం	: 9951602914
మణుగూరు	: 9705944416
సత్తుపల్లి	: 9652868642

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.